క్లుప్తంగా

సంక్షేమ బోర్డు అమలు చేయాలి



బైక్‌లతో ర్యాలీ చేస్తున్న కార్మికులు

సైదాపురం: రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులను తక్షణమే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షులు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను పట్టణ వీధుల్లో బైక్‌లతో ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో చెంగల్‌రావు, శ్రీనివాసులు, నవకోటి, అనిల్, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, పోలయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : మండల కేంద్రంతోపాటు తొగరాముడి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు నోటి, రొమ్ము, గర్భాశయము తదితర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు తరుణ్ సాయికుమార్, చైతన్య, చైతన్యభాను, డాక్టర్లు నవీన, హరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఆక్రమణ



దారికి అడ్డంగా పోసి ఉన్న మట్టి

కలువాయి(సైదాపురం): మండలంలోని మాదన్నగారిపల్లెకు చెందిన గోమసాని రామయ్య పొలాలకు వెళ్లే దారికి కొందరు అడ్డంగా మట్టి పోసి అడ్డగిస్తున్నారని బాధితుడు ఆరోపించారు. న్యాయం కోసం ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా కనికరించడం లేదంటూ బాధితుడు రామయ్య వాపోతున్నారు. అధికారులు ఈ రహదారి విషయమై చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ



అమృతవాణి

ఓజిలి: మండల ఏఓగా అమృతవాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిల్లకూరు మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఏఓగా బాధ్యతలు చేపట్టిన అమృతవాణికి సిబ్బంది ప్రసూన, రవీంద్రబాబు, నాగేశ్వర్‌రావు తదితరులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. సిబ్బంది కలసికట్టుగా పనిచేసి మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

శ్మశానానికి దారి చూపండి



అధికారులకు అర్జీ సమర్పిస్తున్న గిరిజనులు

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు పంచాయతీ బుసపాళెం గ్రామ గిరిజన శ్మశాన వాటికకు దారిచూపి, హద్దులు ఏర్పాటు చేయాలని దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో గిరిజనులు సిద్ధరామయ్య, పి.వెంకటేశ్వర్లు, పి.నాగేశ్వరరావు, సుబ్బమ్మ, ఆర్ ఓసూరమ్మ, టి.ధన్నమ్మ పాల్గొన్నారు.

కండలేరులో 30.095 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 30.095టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1900, పిన్నేరుకాలువకు 100, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 15, మొదటిబ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు		15.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	116
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

నెలబల్లి ఎస్టీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం, వెదురుపట్టురాజుపాళెం ఎస్టీ కాలనీలో మొండిగోడలకే పరిమితమైన భవనం





అంగన్‌వాడీ.. అస్తవ్యస్తం!

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ భవనాల వినియోగం అస్తవ్యస్తంగా మారింది. అంగన్‌వాడీ భవనం సుమారు పదేళ్లుగా మొండిగోడలకే పరిమితం కాగా మరో ఊర్లో భవనం ఉన్నా అద్దె ఇంటిలో కొనసాగుతోంది. వెదురుపట్టు గ్రామంలో లక్షలు వెచ్చించి గత ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఉన్నప్పటికీ గ్రామంలో కేవలం ముగ్గురు పిల్లలే ఉన్నారన్న సాకుతో ఎస్టీ కాలనీలో 10 మంది పిల్లలున్నారని అక్కడే ఉన్న అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలోని అంగన్‌వాడీ భవనం కాంట్రాక్టర్లకు గోదాముగా మారింది. వెదురుపట్టురాజుపాళెం ఎస్టీ కాలనీలోని పిల్లల సౌకర్యార్థం పదేళ్ల కిందట అంగన్‌వాడీ భవనం పనులు మొదలు పెట్టారు. తీరా నిధుల లేమితో భవనం పనులు ఆగిపోయాయి. ఈ భవనం గత కొన్నేళ్లుగా మొండిగోడలకే పరిమితమై క్రమంగా దెబ్బతింటోంది. దీంతో ఎస్టీ కాలనీలోని అద్దె ఇంటిలో నడుపుతున్నారు.

నెలబల్లిలో...

నెలబల్లి గ్రామ పరిధిలోని ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో అంగన్‌వాడీ పిల్లల సౌకర్యార్థం ఐసీడీఎస్, ఉపాధి హామీ పథకం శాఖల ఉమ్మడి నిధులతో ఒక్కొక్క భవనం రూ.7.5 లక్షలతో మంజూరు చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఈ రెండు భవన నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఎస్టీ కాలనీలోని ఈ భవనానికి ప్రైవేటు వ్యక్తులు రేకు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ నిర్మాణాలు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెదురుపట్టులో నిరుపయోగంగా ఉన్న భవనం

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



గ్రీవెన్స్‌డేలో ఇద్దరు అధికారులతో ఎంపీడీఓ

నాయుడుపేట టౌన్: ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయి. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ మాగర్ల రాజేంద్రతో పాటు హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారి మాత్రమే ఉన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్‌తోపాటు మరో నలుగురు అధికారులు వచ్చారు. వీరిలో కొంత మంది సంతకాలు పెట్టి గ్రీవెన్స్ పూర్తి కాకముందే వెళ్లిపోయారు.

మేత పోరంబోకు భూమిని ఫ్యాక్టరీలకు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరురూరల్ : గ్రామంలోని మేత పోరంబోకు భూమిని ఫ్యాక్టరీలకు అనుమతి ఇవ్వొద్దని, గ్రామ ప్రజలకే కేటాయించాలని మండలంలోని మేకనూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం మేకనూరు గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఆయన స్పందించి, గ్రామంలో పర్యటించి భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సర్పంచ్ గౌర్ల విజయ, ఎంపీటీసీ ముమ్మడి ఉమామహేశ్వరి, అమరేంద్ర, రమేష్, గంగాధర్‌రెడ్డి, నల్లిబోయిన కృష్ణయ్య, తిరుపాలయ్య, నీటి సంఘం అధ్యక్షుడు మద్దాలి కృష్ణయ్య, రమణయ్య, మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో రోజూ కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న కార్మికులు

గూడూరురూరల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం రెండో రోజుకు చేరింది. ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సంఘం కార్యదర్శి దారా కోటేశ్వరరావు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, పోలయ్య, కామేశ్వరరావు, నయీం, సుబ్బారావు, సీఐటీయూ గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి పట్టణంలో..

వెంకటగిరి రూరల్ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం రెండో రోజు కొనసాగింది. సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్ చిరంజీవితోపాటు ఇంజినీరింగ్ సెక్షన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మా ఊరి బడినే కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

తడ: ప్రస్తుతం మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మా బిడ్డలు సురక్షితంగా చదువుకుంటున్నారని, ఆ బడిని కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల విలీనంలో భాగంగా తడ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 46 మంది విద్యార్థుల్లో 28 మందిని తడ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలకు పంపేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. పిల్లల భద్రతా కారణాల రీత్యా దీనికి గ్రామస్తులు అంగీకరించలేదు. దీంతో సోమవారం పాఠశాల జరుగుతున్న సమయంలో బడివద్దకు వెళ్లిన తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఆ తరువాత పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోయారు.

దర్జాగా నది కబ్జా



నదిని ఆక్రమించి సాగు చేసిన భూమి

కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో పెన్నానదిలో ఫెన్సింగ్ వేసి వేరుశనగ పంట కూడా వేశారు. అయినా రెవెన్యూ కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ అటు వైపు చూడరు. ఇటీవల కలువాయి మండలంలో భూ ఆక్రమణలు అధికమయ్యాయి. కుల్లూరు సచివాలయం పరిధిలో రెవెన్యూ అధికారులు గ్రామంలోకి రాకుండానే వెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలను చూపుతున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 13వ వార్డులోని ఓ ఇంటి వద్ద విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని 14వ వార్డు కౌన్సిలర్, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఆరి శంకరయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కేవలం మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు.

సాగరమాల బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న వీపీ అగ్రహారానికి చెందిన రైతులు

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. మండలంలోని వీపీ అగ్రహారం, కొత్తపాళెంకు చెందిన బాధితులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోట మండలంలో సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు అడిగిన వెంటనే ఇచ్చామన్నారు. ఊనుగుంటపాళెం, విద్యానగర్, కొత్తపాళెం, వీపీ అగ్రహారం మీదుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే ఇంకా 27 మందికి నష్టపరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. తాము సాగు చేసుకుంటున్న పట్టా భూములను రోడ్డు కోసం వదులుకున్నామన్నారు. వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించని పక్షంలో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామని చెప్పారు.

పరిహారం ఇవ్వకనే పనులు పూర్తి

చిల్లకూరు : క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకనే అభివృద్ధి పనులు చేస్తున్నారని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని రైతులు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగినగ్రీవెన్స్ డే సందర్భంగా వినతి పత్రం అందించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సబ్ కలెక్టర్ చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫోన్ చేసి భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తనకు నాలుగు రోజుల్లో అందించాలని ఆదేశించారు. త్వరలోనే పరిష్కారం చూపుతామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

పేకాట స్థావరంపై దాడులు



పోలీసులకు పట్టుబడిన జూదరులు

దక్కిలి: మండలంలోని కమ్మపల్లి దళితవాడ గ్రామ శివారులోని తోటల్లో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం ఎస్ఐ శివశంకర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,200 నగదు పేకలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

రాపూరు: మండల కేంద్రంలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు కందుకూరు చంద్రశేఖర్, కందుకూరు మస్తాన్‌బాబు తెలిపారు. నెల్లూరులోని స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి వైద్యులు రాజేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితం వ్యాన్‌లో నెల్లూరుకు తీసుకెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి తీసుకువస్తారని తెలిపారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో నిర్వహించగా అధిక మొత్తంలో రెవెన్యూ పరమైన సమస్యలపై అర్జీలు రైతుల నుంచి అందాయి. అడగళ్లు, 1బీ, పాస్‌పుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు కోసం రైతులు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన్ వివిధ శాఖల అధికారులు హరికృష్ణ, మోహన్‌రావు, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఆహ్వానం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం వద్ద టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. అండర్ -14 బాలుర విభాగంలో ఈ నెల 21, 22 తేదీల్లో వెంకటగిరి డివిజన్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సెక్రటరీ మనోహర్ 9490252821ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగులకు గుర్తింపు కార్డులు

దక్కిలి: మండల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న కార్యాలయం సిబ్బంది, వీఆర్వో, విలేజ్ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ (వీఆర్ఏ)కు సోమవారం తహసీల్దార్ ఎం శ్రీనివాసులు గుర్తింపు కార్డులు, ట్యాగ్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మురహరి, జూనియర్ అసిస్టెంట్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

పగిలిన పైప్‌లైన్ .. తాగునీటి సరఫరాకు బ్రేక్



దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని విన్నమాల సప్లయ్ చానల్‌లో జేసీబీతో సోమవారం పూడిక తీత పనులు చేపట్టారు. పాగొట్టం కాలనీ సమీపంలో పూడిక తీస్తుండగా తాగునీటి పైపు లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో తాగునీటి సరఫరాను నిలిపి వేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కాలువ వద్దకు చేరుకుని పరిశీలించారు. సిబ్బందితో మరమ్మతు పనులు చేపట్టారు. అయితే ఇవి పూర్తి చేయడానికి రెండు రోజులు పడుతుందన్నారు. ఈ క్రమంలో పాగొట్టం కాలనీ, కాలవ గట్టు, శంకరాపురం, జైహింద్ కాలనీ, బాలాజి గార్డెన్, బ్రాహ్మణ వీధి, రజక కాలనీ, గరిడీ వీధి, రాజగోపాలపురం, బజారు వీధి తదితర ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

మండల సర్వేయర్‌గా పెంచలయ్య



దక్కిలి: మండల సర్వేయర్‌గా పెంచలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ రాజగోపాల్ వెంకటగిరికి బదిలీ అయ్యారు. తడ సర్వేయర్‌గా పని చేస్తున్న పెంచలయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు.

అందుబాటులో ఉండాలి

సైదాపురం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ సహాయకులు గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ హైమావతి కోరారు. మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయంలో సోమవారం వీఏఏ, వీహెచ్ఏలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఎడగారు పంటను సాగు చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీలో యూరియా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రైతు పంట సాగు చేసే ముందు ఈ క్రాప్‌ను నమోదు చేసుకోవాలని కోరారు.

అవకతవకలపై విచారణ

గూడూరురూరల్ : గూడూరు నుంచి విందూరు మీదుగా గిద్దలూరు గ్రామం వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనుల్లో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

చిట్టమూరు : మండలంలోని రైతులు తమ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఎంపిక కాని రైతులు ఆన్‌లైన్‌లో తమ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్ ఖాతా నంబరుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు.

శాకాంబరిగా పర్వతవర్ధిని



రాపూరు: మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో వెలసిన పర్వతవర్ధిని దేవి అమ్మవారికి ఆషాఢ మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, కుంకుమార్చన సేవ నిర్వహించారు. సాయంత్రం 21 రకాల పచ్చికూరగాయలతో శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రకృతి సాగు లాభదాయకం

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో లాభదాయకమని డిస్ట్రిక్ మోడల్ మేకర్ వీరరాఘవయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆహార ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే కషాయాలు, ఘనజీవామృతం వంటి ఎరువులతో పండించిన కూరగాయలు వినియోగించడంతో వ్యాధులు దూరమవుతాయన్నారు.





ఆషాఢాన సీతాకోక సందడి

సైదాపురం: అంతరించిపోతున్న సీతాకోక చిలుకలు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పూల చెట్లపై సందడి చేస్తున్నాయి. ఆషాఢ మాసంలో పూలచెట్లకు విపరీతమైన పూలు పూస్తాయి. ఈ పూలలో మకరందాన్ని సేకరించేందుకు సీతాకోక చిలుకలు ఆపూలపై వాలుతున్నాయి. ఈ మాసంలో ఈ పూల చెట్టు మీద చూసిన సీతాకోక చిలుకల అందాలు ఆకట్టుకుంటున్నాయి.

నాలుగు దుకాణాల్లో చోరీలు



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిల్లకూరు: గూడూరు పట్టణం నడిబొడ్డున ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో చోరీ జరిగింది. గూడూరు ఒకటో పట్టణం టవర్ క్లాక్ ప్రాంతంలోని ధర్మరాజుల స్వామి దేవస్థానానికి చెందిన ద్రౌపది కాంప్లెక్స్‌లో సుమారు 40 దుకాణాలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నాలుగు దుకాణాల పైభాగంలోని రేకులు కట్ చేసి, దుకాణాల్లోకి దిగి చోరీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ రిపేర్ దుకాణంలో నాలుగు సెల్‌ఫోన్లు, రూ 2 వేలు నగదు, చిల్లర దుకాణంలో రూ.4 వేలు నగదు, చోరీ చేశారు. అలాగే మరో రెండు దుకాణాల్లో నగదు ఏమీ లేకపోవడంతో ఎక్కడ సామాను అక్కడే వదలి వెళ్లిపోయారు. చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.